ఆ కిరాతకుల్ని నరికి న్యాయవ్యవస్థని ప్రశ్నించిన ఆమె ఎవరు?

# అందుకే అందుకే...


## అభిమన్యు కథ

కోర్టుహాలు కిక్కిరిసి వుంది. గుంపులుగుంపులుగా జనం నిల్చొని చూస్తున్నారు. వింటున్నారు. ఫోటోగ్రాఫర్ల చేతిలోని కెమెరాలు తళుక్ తళుక్‌మని వెలుగుతున్నాయి. విలేకర్ల చేతిలోని పెన్నులు చకచకమని కదులుతున్నాయి.

"ఫఫఫ యువరానర్! ఈ సంధ్య అనే హంతకి మానవత్వం మర్చిపోయి అతిదారుణంగా నలుగురు వ్యక్తుల్ని గొడ్డలితో నరికి చంపివేసింది. ఈమె చేసే ఈ కిరాతకంవలన పట్టణమంతా అట్టుడికిపోతుంది. ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బితుకు బితుకుమని జీవిస్తున్నారు. కాబట్టి ఈ నరరూప రాక్షసికి తగిన శిక్ష విధించవలసిందిగా కోరుతున్నాను" పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి హావభావాలు ప్రకటిస్తూ బిగ్గరగా అరుస్తూ అన్నాడు.

కృష్ణమూర్తికి నలభై ఐదు సంవత్సరాలు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పది సంవత్సరాల అనుభవం వుంది. ఇంతవరకూ అతను గెలవని కేసు అంటూ లేదు. క్రిమినల్స్‌కి అతను సింహస్వప్నం. తన అపారమైన తెలివితేటలతో, వాగ్ధాటితో వాదించి క్రిమినల్స్‌కి శిక్ష పడేట్టుగా చేసేవాడు. కృష్ణమూర్తి అంటే ఏ కొద్దిమందికో తెలుసు. క్రిమినల్ కృష్ణమూర్తి అంటే తెలియనివారు లేరేమో!

జడ్జి విశ్వనాథం ముక్కుమీదకు జారుతున్న కళ్లజోడును సరిచేసుకుని, ఒక్కసారి హాలంతా కలియజూశారు. అందరి దృష్టి తనమీద, తను చెప్పబోయే తీర్పుమీద వుందని గ్రహించారు. బోనులో నిల్చున్న



సంధ్యవైపు చూసి అడిగారు.

"చూడమ్మా! ఈ హత్యలు నీవే చేశావా?"

"అవును"

"ఊ!" గంభీరంగా తలాడించి, "కోర్టు వారికి చెప్పుకోవలసిందేమైనా వుందా!?" అడిగారు జడ్జి.

అంతవరకూ కోర్టు గోడలకి వ్రేలాడు

తున్న దేశ నాయకుల్ని చూస్తున్న సంధ్య చటుక్కున తలతిప్పి జడ్జివైపు చూసింది. ఆమె కళ్లు చింతనిప్పుల్లా వున్నాయి. ముఖం ఎర్రగా కందిపోయి వుంది. "ఉంది" అని అర్థం వచ్చేట్టుగా తలూపింది. గుండెలనిండా గాలి పీల్చుకుని కోర్టు హాలంతా ఒక్కసారి కలియజూసింది.

"మిస్టర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్! ఒక్క నిమిషం" అని సంధ్య పిలవగానే కుర్చీలో కూర్చున్న . కృష్ణమూర్తి కోటు సర్దుకుని కళ్లద్దాలు సరిచేసుకుని "ఎస్..." అంటూ ఆమె దగ్గరకు వచ్చాడు.

సంధ్య, పెదవులమీద చిర్నవ్వు విరిగింది మరుక్షణం ఆమె కుడిచేయి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి చెంపను బలంగా తాకింది. 'ఫెళ్'మనే శబ్దం కోర్టుహాలంతా మారుమోగింది. కృష్ణమూర్తి "అమ్మా!" అంటూ తన చెంపను పట్టుకున్నాడు. అనుకోని, ఊహించని ఈ పరిణామానికి అంతా నోళ్లు తెరిచి, విభ్రాంతులై చూస్తున్నారు . సంధ్యకిరువైపులా వున్న ఆడ పోలీసులు ఆమె చేతులు బలంగా పట్టుకున్నారు.

"మిస్ సంధ్యా! ఏమిటి నువ్వు చేసిన పని? పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని అందులో పబ్లిక్ సర్వెంట్‌ని కొడ్తావా? అతన్నెందుకు కొట్టావ్?" జడ్జిగారు కోపంగా అడిగారు.

"వెల్ మిస్టర్ జస్టిస్! పబ్లిక్ సర్వెంట్ అయిన ఈ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని కొట్టిన ందుకు ఎందుకు కొట్టావ్? అని అడిగారు. అవును, ఎందుకు కొట్టాను? కొట్టాల్సిన అవసరం నాకేంటి? చెప్పండి ఆ అవసరాన్ని కల్పించింది మీరు. నలుగుర్ని గొడ్డలితో నరికినందుకు హంతకి అన్నారు. నరరూప రాక్షసి అన్నారు. 'ఈ హత్యలు నీవే చేశావా?' అని అడిగారు. కాని, ఎందుకు చేశావ్? వాళ్లని చంపాల్సిన అవసరం ఏమిటి ? అని అడిగారా! లేదే! ఇంతమంది లాయర్లున్నారు. ఇంతమంది మేధావులున్నారు. ఒక్కరు... ఒక్కరైనా అడిగారా? ఏం...? ఎందుకు అడగలేదు?" సంధ్య ఆవేశంతో ఊగిపోతూ అడిగింది.

జడ్జిగారి వీపుమీద కొరడా ఝుళిపించిన ట్లయింది. తను చేసిన తప్పిదం గుర్తుకు వచ్చి కుర్చీలో అసహనంగా కదిలి, గొంతు తగ్గించి అడిగారు.

"మిస్ సంధ్యా! ఆవేశపడినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. అసలు జరిగిందేమిటో చెప్పు"

సంధ్య గుండెలనిండా గాలిపీల్చుకుని, రెండు నిమిషాలు రిలాక్సయి చెప్పడం ప్రారంభించింది.

◇ ◆ ◇

మద్రాస్ రైల్వే స్టేషన్ సంతలా వుంది. దాదర్ ఎక్స్‌ప్రెస్ మరో ఐదు నిమిషాల్లో బయలుదేరబోతోందని అనౌన్స్ చేశారు. రిజర్వేషన్ ఛార్ట్ చూసి రిజర్వుడు కంపార్ట్‌మెంట్‌లోని తన బెర్త్‌మీద కూర్చుంది సంధ్య. ఆ కంపార్ట్‌మెంట్‌లో ఆమెతోపాటు ఇరవై ఐదుమంది వున్నారు.

సంధ్య తన తల్లిదండ్రులకి ఒక్కర్తే కూతురు. వారం రోజుల క్రితం 'లా' కంప్లీట్ చేసి తన ఫ్రెండ్‌ని చూడ్డానికని మద్రాస్ వచ్చింది.

ట్రైన్ ప్లాట్‌ఫాం దాటుతుండగా నలుగురు వ్యక్తులు ఆ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కారు.వారి వాలకం చూస్తుంటే రౌడీలనే

తెలుస్తుంది. కాని, వీధిరౌడీలో, స్టేట్ రౌడీలో తెలీదు. బలవంతంగా ఒకరిద్దరు పాసింజర్లను లేపి కూర్చున్నారు. అందులో ఒకడు సంధ్య బుగ్గగిల్లి "పిల్ల భలేగుంది" అన్నాడు. రెండోవాడు ఆమె చేతిలోని పుస్తకం లాక్కుని సిగరెట్ పొగ గుప్‌మని ముఖంమీద వదిలాడు. మూడోవాడు ఆమె నడుంమీద చెయ్యేసి "వస్తావా!" అని అడిగాడు. మరుక్షణం సంధ్య వాడి చెంప పగులగొట్టింది.

అంతే! ఆ నలుగురూ రావణాసురులయ్యారు. దుశ్శాసనులయ్యారు. కీచకులయ్యారు. పిచ్చికుక్కల్లా సంధ్యమీద పడ్డారు.

వాళ్లకి ఎదురుతిరిగిన నలుగురైదుగురు ప్రయాణీకులను చితకబాదారు. నోట్లోంచి, ముక్కుల్లోంచి రక్తం కారేట్లు కొట్టారు. ఆ బీభత్సాన్ని చూసి మిగిలిన ప్రయాణీకులు బిక్కచచ్చిపోయారు.

మానవత్వాన్ని మరచి దానవులుగా ప్రవర్తించారు. కామంతో, క్రోధంతో పశువుల్లా ఆమె శరీరమంతా రక్కారు. కొరికారు. పైశాచికంగా, సామూహికంగా మానభంగం చేశారు.

◇ ◆ ◇


"మిలార్డ్! ఈ పవిత్ర భారతదేశంలో స్త్రీకి మానంకన్నా విలువైనది ఏమైనా వుందా?"

"ఈ దేశంలో న్యాయ వ్యవస్థ నిద్రపోలేదనీ, నన్ను చెరిచిన ఆ రాస్కెల్స్‌ని పట్టి శిక్షిస్తారనే ఆశతో, నమ్మకంతో పోలీస్ స్టేషన్‌కెళ్తే ఆ ఇన్స్‌పెక్టర్... అదిగో ఆ రాస్కెల్ ఏమన్నాడో తెలుసా మిలార్డ్!"

"నలభై సంవత్సరాలైన నాకే మనిషింత కసిగా కనిపిస్తే ఆ కుర్రాళ్లకి కనిపించడంలో తప్పేముంది?"

"మిలార్డ్ ఆడది అందంగా వుండడం నేరమా? మీ న్యాయస్థానాలు న్యాయాన్ని రక్షించడానికా? అన్యాయానికి ఆశ్రయం ఇవ్వడానికా?"

సంధ్య ఆవేశంతో ఊగిపోతోంది. ఆమె



శరీరమంతా స్వేదంతోనిండుకుంది. ఆమె గొంతుకంచుగంటలా మోగుతుంది. ఆ హాలులో వున్నవారంతా చెవులు రిక్కించి, నిలువుగుడ్లేసుకుని చూస్తున్నారు.

"అత్యాచారం జరిగిందని నిర్ధారణ అయినా ఫిర్యాదు అందనిదే ఈ పోలీసులు కదలరు. ఒకవేళ ఫిర్యాదు అందినా, తమముందే విచ్చలవిడిగా విహారాలు చేస్తున్న రౌడీలను కనీసం అదించడానికైనా ధైర్యంలేని, గుండెలేని, చేవలేని ఈ బక్క రక్షకభటులు ఏదో చేస్తారని ఆశించడం వెర్రి, పిచ్చి"

"మిలార్డ్! ఈ పవిత్ర భారతదేశంలో అర్ధరాత్రివేళ ఆడది ఒంటరిగా ఇంటికి చేరగలిగిననాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లని గాంధీగారు అన్నారు. రాత్రిమాట అటుంచండి. పట్టపగలు రిజర్వుడు భోగిలోని స్త్రీల మానానికి, ప్రాణానికి రక్షణలేని భయంకరమైన అరాచకత్వం దేశంలో తాండవిస్తున్నది."

"ఇంకా మనం ఎందుకు బతికి వున్నాం? మన తల్లిని, చెల్లిని, పెళ్లాన్ని మన కళ్లముందు మానభంగం చేస్తుంటే చేవలేక ఏమీ చేయలేక అస్థిపంజరాల్లా ఊగుతున్నాం. ఇంకా ఎందుకీ బతుకులు? ఎందుకీ చదువులు? ఎందుకీ మేధావులు? ఎందుకీ చట్టాలు? ఎందుకీ న్యాయాలు? సభ్యత... సభ్యత... నాగరికత... నాగరికత అనే ముసుగులు దేనికి? ఎవరికోసం? మన బాగుకోసమా? మన పతనంకోసమా?

"మిలార్డ్! మనకు స్వాతంత్ర్యం వచ్చి ఎన్ని సంవత్సరాలైంది? 'స్త్రీ'ని స్త్రీగా చూసేరోజు ఎప్పుడు వస్తుంది? ఎన్ని సంవత్సరాలు పడ్తుంది? అంతవరకూ మేమంతా ఈ మగరాక్షసుల చేతుల్లో అన్యాయమైపోవలసిందేనా? చెప్పండి. అందుకే మదమెక్కిన ఆ మదపిచ్చిగాళ్ల తలలు నరికాము..."

"మిలార్డ్! కామాంధులకు బెయిల్ ఇవ్వడానికి సంకోచించవు ఈ కోర్టులు. కాని, మానభంగానికి గురైన స్త్రీ తనపై అత్యాచారం జరిగిందని నిరూపించుకోవాలి. రేప్ జరిగిన సమయంలో స్త్రీ ప్రతిఘటించిందా? లేదా? ప్రతిఘటిస్తే సాక్ష్యాలేమిటని? ఈ లాయర్లు, ఈ కోర్టులు, ఈ పోలీసులు గాయాన్ని సూదులతో కెలికినట్లు కెలుకుతారు. ఇక పరిష్కారం ఎప్పుడు? చెప్పండి"

"మి లార్డ్! పురుషాధిక్యతగల ఈ దేశంలో స్త్రీకి రక్షణ ఎక్కడ? మగాడి కామానికి, అహంకారానికి, దౌర్జన్యానికి ఆడది అడుగడుగునా బలైపోతుంటే ఈ పోలీసులు, ఈ చట్టాలు, ఈ కోర్టులు, ఈ నేతలు చూసి ఊరుకుంటున్నారేగాని, అన్యాయాలనుంచి అత్యాచారాలనుంచి మమ్మల్ని రక్షిస్తున్నాయా...!?"

"అందుకే... అందుకే.... మి లార్డ్! ఆ లం.... ని కసిదీరా గొడ్డలితో నరికిపోగులుపెట్టాము"

సంధ్య అలసిపోయి ఆ బోనులో వాలిపోయింది.

అంతవరకూ బిగుసుకుపోయి చూస్తున్న గోడ గడియారం 'సినిమాలో'లా 'ఠంగ్... ఠంగ్'మని ఐదుసార్లు మోగింది.

★